ఔను.. వాళ్లంతా ఒక్కటయ్యారు

"మంత్రి మల్లారెడ్డి గొప్ప నాయకుడు.. ఆరు లక్షల మంది ఓటర్లు ఉన్న మేడ్చల్‌కు ఆయనే సమర్థుడైన నాయకుడిని.. మేడ్చల్ నుంచి బీఆర్ఎస్ నుంచి రంగంలోకి దించాం.
- ముఖ్యమంత్రి కేసీఆర్


మల్లారెడ్డి లక్ష్మీ పుత్రుడు ఆయనకు వద్దంటే డబ్బులే డబ్బులు.. ఆయనను ఎదుర్కొనే సత్తా రాజకీయాల్లో ఎవరికీ లేదు.
- కల్వకుంట్ల కవిత"

"మంత్రి మల్లారెడ్డికి సోషల్ మీడియాలో, ఇతర మీడియాలో ఉన్న ఫాలోయింగ్ నాకు కూడా లేదు. ఆయన ఎదురులేని నాయకుడు.
- మంత్రి కేటీఆర్

మంత్రి మల్లారెడ్డి అన్ని విధాలా బలమున్న నాయకుడు.. ఆయన అనుకుంటే ఏదైనా చేయగలుగుతాడు. ఎదుర్కొనే సత్తా ఎవరికీ లేదు.
- మంత్రి హరీష్‌రావు"

- మేడ్చల్‌లో మల్లారెడ్డి వర్సెస్ కాంగ్రెస్ టీమ్
- ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా ఓడించాల్సిందే..
- అన్ని రాజకీయ అస్త్రాలు సిద్ధం చేసుకొని..
- కలిసి పనిచేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేతలు

....ఇలా బీఆర్ఎస్ అగ్ర నాయకులే మంత్రి మల్లారెడ్డి బలమైన నాయకుడని కితాబులిస్తూ ఆయనను బలవంతుడిని చేశారు. నేటి రాజకీయాల్లో అర్థ బలం ఉన్న నాయకుడు, నాలిక ఉన్న నాయకుడే బలమైన నాయకుడు. రెండు గట్టిగా ఉండటంతో మంత్రి మల్లారెడ్డి స్వల్పకాలంలోనే బలమైన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అట్లాంటి బలమైన నాయకుడిని ఎన్నికల్లో ఎదుర్కొనేందుకు మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు ఒక్కటయ్యారు. మంత్రి మల్లారెడ్డి కంటే రాజకీయంలో సీనియర్లు, గతంలో మేడ్చల్ రాజకీయాన్ని వివిధ పార్టీల్లో ఉండి నడిపించిన నాయకులు ఒకేతాటిపైకి వచ్చి రాబోయే ఎన్నికల్లో మల్లారెడ్డిని ఓడిస్తామని శపథం చేస్తున్నారు. - మేడ్చల్



మంత్రి మల్లారెడ్డి కారణంగా సుదీర్ఘ రాజకీయ చరిత్ర, భవిష్యత్ కోల్పోవాల్సిన ప్రమాదంలో పడ్డ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్‌కు అండగా నిలబడ్డారు. మంత్రి మల్లారెడ్డి వల్ల తనకు రెండుసార్లు టికెట్ రాలేదని, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నక్క ప్రభాకర్‌గౌడ్ పార్టీ అభ్యర్థి వజ్రేష్ యాదవ్ వెంట కాలికి బొంగరం కట్టుకుని తిరుగుతున్నాడు. కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ హరివర్ధన్‌రెడ్డి అలక బూనినా చివరకు కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు పలికి పోరాటం కోసం తన ఆయుధాలను సిద్ధం చేసుకుంటున్నారు.

రేవంత్‌రెడ్డి, మైనంపల్లి వ్యూహాలతో..

జిల్లా కాంగ్రెస్‌ను లీడ్ చేస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డిని ఓడించాలని పట్టుదలతో ఉండటంతో తన శిష్యుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌ను మొదట కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌కు మద్దతు పలికించాడు. అలకబూనిన హరివర్ధన్‌రెడ్డి ఇంటికి వెళ్లి బుజ్జగించారు. రేవంత్‌రెడ్డి తన బంధువైన మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డిలను పార్టీలోకి ఆహ్వానించి వజ్రేష్‌కు బలం చేకూర్చారు.

అగ్రనేతలందరూ కాంగ్రెస్‌లో చేరి..

ఒకనాడు వివిధ పార్టీల్లో ఉంటూ రాజకీయాలు నడిపిన అగ్రనేతలందరూ కాంగ్రెస్‌లో చేరి బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డిని ఓడించేందుకు రంగంలోకి దిగారు. ఓ జట్టుకు కెప్టెన్‌గా మంత్రి మల్లారెడ్డి ఉండగా మరోవైపు తోటకూర వజ్రేష్ యాదవ్ కెప్టెన్‌గా టీంసభ్యులుగా హరివర్ధన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, శరత్‌చంద్రారెడ్డి ఉన్నారు. ఒక్కటైన నాయకులు నియోజకవర్గంలో తమ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల నుంచి వివిధ పార్టీల్లో ఉన్న తమ నేతలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నారు.

మల్లారెడ్డిని తట్టుకునే శక్తి లేక..

మేడ్చల్ రాజకీయంలో ప్రవేశించి సునామీలా వ్యాపించిన మంత్రి మల్లారెడ్డి వల్ల దాదాపు అన్ని పార్టీల అగ్ర నాయకులు బాధితులుగా మారిపోయారు. టీడీపీ నుంచి ఎంపీగా మల్లారెడ్డి, ఎమ్మెల్యే తోటకూర వజ్రేష్‌యాదవ్ పోటీ చేసినా మల్లారెడ్డి గెలిచారే గానీ తోటకూర ఓడిపోయారు. మొదటి నుంచి బీఆర్ఎస్‌లో ఉండి టికెట్ కోసం ఆశపడ్డ హరివర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్‌లు మల్లారెడ్డి రాజకీయం ముందు తేలిపోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. తనకు టికెట్ రాకుండా చేసి తన రాజకీయ భవిష్యత్ నాశనం చేశారని సుధీర్‌రెడ్డి సైతం బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. ఇలా నాయకులంతా మల్లారెడ్డి ధన, రాజకీయం ముందు తేలిపోవడం, ఆయనను తట్టుకునే శక్తి లేకపోవడం, బీఆర్ఎస్ అధినాయకత్వం ఆయననే నమ్మడంతో ఒక్కొక్కరుగా కాంగ్రెస్ గూటికి చేరారు.

రాజకీయ భవిష్యత్ కష్టమే..

ఈ ఎన్నికల్లో మల్లారెడ్డిని ఓడిస్తే 2026లో నియోజకవర్గాల పునర్విభజన ఉండటంతో మేడ్చల్ మూడుగా మారుతుందని, అప్పుడు ఒకరికొకరు సహాయం చేసుకుని సులువుగా ఎమ్మెల్యేలుగా గెలుపొంద వచ్చని అంతా.. ఒక జట్టుగా మారారు. ఈ సారి మల్లారెడ్డిని ఓడించకపోతే భవిష్యత్‌లో పునర్విభజన జరిగినా తన ఇద్దరు కుమారులను పోటీగా పెడతారని, ఈ సారి ఎలాగైనా ఓడించేందుకు అసమ్మతి నాయకులంతా ఒక్కటైనట్లు వారి అనుచరులు చెబుతున్నారు. ఈ సారి మల్లారెడ్డి గెలిస్తే తమకు రాజకీయ భవిష్యత్ లేకుండా చేస్తారని వారు అంటున్నారు. మొత్తం మీద ఒక్క నాయకుడిపై మిగతా నాయకుల రాజకీయ భవిష్యత్ ఆధారపడి ఉండటంతో మేడ్చల్ ఎన్నికలు మల్లారెడ్డి వర్సెస్ కాంగ్రెస్ టీంగా మారాయి.



మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

నేను పక్కా లోకల్.. మల్లారెడ్డి నాన్‌లోకల్

మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్

జంగ్ 2023 తెలంగాణ

మేడ్చల్: నేను పక్కా లోకల్ అని మంత్రి మల్లారెడ్డి నాన్‌లోకల్, డబ్బులతో రాజకీయం చేస్తున్న మంత్రి మల్లారెడ్డిని ఓటర్లు ఈ ఎన్నికల్లో ఓడించాలని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన ఉమ్మడి మేడ్చల్ మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లారెడ్డి నాన్ లోకల్ వ్యక్తి అని.. తాను మేడ్చల్ గడ్డ మీద పుట్టి పెరిగిన కిందిస్థాయి నుంచి వచ్చి ఎమ్మెల్యే పోటీచేసే స్థాయికి ఎదిగానని అన్నారు. తనకు ప్రతి గ్రామంలో ఎవరు ఎంత కష్ట పడుతున్నారో.. వారి సమస్యలు తనకు తెలుసన్నారు. 30 ఏళ్ల నుంచి రాజకీయం చేస్తున్నానని, మంత్రి మల్లారెడ్డి 2014కు ముందు తన దగ్గరకు వచ్చి టీడీపీలో చేర్పించాలని కోరాలేదా? అని ప్రశ్నించారు. మల్లారెడ్డికి మేడ్చల్ నియోజకవర్గంలో ఎన్నో ఆస్తులు ఉన్నా.. తన ఓటు హక్కును బోయిన్‌పల్లిలోనే ఎందుకు ఉంచుకున్నారని, మైసమ్మగూడకు ఎందుకు మార్చుకోవడం లేదని ప్రశ్నించారు. తాను యాదవ కుటుంబంలో పుట్టి పాల వ్యాపారం చేసినా వందల కోట్లకు ఎందుకు ఎదగలేదని, మల్లారెడ్డి ఎలా సంపాదించారో రహస్యం అందరికీ చెప్పాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, నాయకులు రమణరెడ్డి, రాపోలు రాములు, చాపరాజు, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిపేట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం మేడ్చల్‌లో, తూంకుంటలో సమావేశాలు నిర్వహించగా అసమ్మతితో ఉన్న నేత హరివర్ధన్‌రెడ్డి, ఆయన వర్గీయులు హాజరు కాలేదు.

బీఆర్ఎస్‌కు పలువురి రాజీనామా

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు సుధాకర్‌రావు, బీఆర్ఎస్ కార్యదర్శి హరీశ్, బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్‌తోపాటు అనుచరులు తమ రాజీనామాను అధిష్టానికి పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. త్వరలో తమ అనుచరులతో కలిసి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన వారిలో ఆనంద్, సురేశ్, హరికష్ణ, సత్యనారాయణ, వీణేగోపాల్, నర్సింగ్‌రావు, శ్రీను, వెంకట్‌రావు, వీరరాఘవులు, మస్తాన్‌రావు, సుబ్బయ్య, జహంగీర్, మహేందర్‌రెడ్డి ఉన్నారు.


ఘట్‌కేసర్‌లో రాజీనామా లేఖలు ప్రదర్శిస్తున్న సుధాకర్‌రావు, హరీశ్, ప్రసాద్

మైనార్టీల సంక్షేమానికి కృషి చేసిన బీఆర్ఎస్

కీసర: రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి కృషిచేసిన సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా గెలుపొందడం ఖాయమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నాగారం మున్సిపల్ మైనార్టీ విభాగం ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మంత్రి మహమూద్ అలీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేశాడన్నారు. నాగారం మున్సిపాలిటీలో మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈద్గాల అభివృద్ధితో పాటు, ప్రభుత్వ భూమిని కేటాయించనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నేత భద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, బీఆర్ఎస్ నేతలు షఫీ, గౌస్, పాషబాయ్, గూడురు అంజన్న, సాయినాథ్‌గౌడ్, రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.



రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..

శామీర్‌పేట్: రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ మేడ్చల్ అభ్యర్థి వజ్రేష్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంతో పాటు తూంకుంట మున్సిపాలిటీ కార్యకర్తలతో శుక్రవారం తూంకుంటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నాడని అన్నారు. సుమారు 50 మంది ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. సమావేశంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, పలు మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

క్లుప్తంగా...

స్వేచ్ఛగా ఓటు వేయాలి



కీసర: వచ్చేనెల 30న జరగనున్న ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కీసర సీఐ వెంకటయ్య అన్నారు. శుక్రవారం కీసర పోలీసులు పారామిలటరీ బలగాలతో కలిసి నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి, కీసర మండలంలోని వన్నిగూడం, భోగారం, బర్సిగూడ తదితర గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

ఉప్పల్: హబ్సిగూడ ఫీడర్ హెచ్‌ఎంటీనగర్, ఎన్‌జీఆర్ఐ సబ్ స్టేషన్ పరిధిలోని హైకోర్టు కాలనీ, బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామిరెడ్డి తెలిపారు. 11 కేవి రాఘవేంద్రనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా హబ్సిగూడ వీధి నంబర్-8 రవీంద్రనగర్, మహేశ్వరినగర్, జేఎస్ఎన్ కాలనీ, సత్యనారాయణ స్వామి టెంపుల్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

చేయూత

అల్వాల్: అల్వాల్ డివిజన్ బండ బస్తీలోని ఇంటి వద్ద తీవ్ర గాయాలపాలైన చిన్నారి ఆదిత్య వైద్య ఖర్చులకు నిమిత్తం స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి చిన్నారి తల్లిదండ్రులకు ఆర్థిక చేయూత అందజేశారు. ఆదిత్యకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

లక్కీడ్రాలో యాక్టివాను సొంతం చేసుకున్న మల్లేష్‌గౌడ్

మల్లాపూర్: నెహ్రూనగర్ దుర్గామాత అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తీసిన లక్కీడ్రాలో రాంపల్లివాసి మల్లేష్‌గౌడ్ హోండా యాక్టివా గెలుచుకున్నారు. అదేవిధంగా పలువురికి వెండి కాయిన్లను అందజేశారు. యాక్టివా తాళం చెవులను బీఆర్ఎస్ సీనియర్ నేత కుంటి కృష్ణ, ఎడ్ల వెంకటేశ్వర్లు ఆయనకు అందజేశారు. వెంకటేష్, శ్రీను, భూపతి అశోక్, రాఘవేంద్ర శ్రీను, సాయి పాల్గొన్నారు.

22 కేజీల గంజాయి స్వాధీనం

మల్కాజిగిరి: ఎన్నికల తనిఖీలు చేస్తున్న మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నారు. మల్కాజిగిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మౌలాలి రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. మహేంద్ర సేథీ వ్యక్తి వద్ద 20 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, విచారణలో ఒడిశా నుంచి తీసుకు వచ్చినట్లు తెలిపారన్నారు. రైల్వే స్టేషన్‌లో మరో 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ముకుందరెడ్డి, ఇన్‌స్పెక్టర్ భరత్‌భూషణ్, ఎస్ఐలు కుమారస్వామి, ధన్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై నిఘా

మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, అభ్యర్థులు ఎన్నికల కమిషన్ సూచించిన దాని కంటే ఎక్కువ ఖర్చు చేసినట్లయితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం టిఫిన్ నుంచి మొదలుకొని ప్రచారం తదితర కార్యక్రమాలు ముగిసే సమయం వరకు ఎన్నికల సంఘం రేట్లను నిర్ణయించిందని, దాని ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు జిల్లా అధికారులకు సహకరించాలని కోరారు. ఒక్కో పార్టీ నుంచి బరిలో ఉన్న అభ్యర్థి ఖర్చు ఎన్నికల్లో రూ.40 లక్షలకు మించొద్దని ఎన్నికల సంఘం ఆదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో రోజు వారీ ఖర్చు వివరాల సేకరణపై ఎన్నికల వ్యయ పరిశీలకులుగా జిల్లా ట్రెజరీ అధికారి యాదగిరి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌రావు వ్యవహరిస్తారని, ప్రతిరోజూ పార్టీలకు సంబంధించిన ఎన్నికల ఖర్చుల వివరాలను సేకరిస్తారని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నుంచి ఎన్నికల ప్రచారం పూర్తయ్యే వరకు.. ప్రతి పనికి అయ్యే ధరల వివరాలను ఎన్నికల కమిషన్ రూపొందించిందని దాని ప్రకారం ఎక్కడెక్కడ ఏ కార్యక్రమాలు నిర్వహించినా ఎన్నికల కమిషన్ ప్రకారం ఖర్చులను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ధరలు వేర్వేరుగా ఉంటాయని, ఖర్చు ఎక్కువైతే అభ్యర్థిపై చర్యలు ఉంటాయన్నారు.

చెక్ పోస్టుల వద్ద 24 గంటల తనిఖీ

మేడ్చల్ జిల్లాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద 24 గంటల తనఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియావళి ఉల్లంఘనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకునే క్రమంలో జిల్లాలో ఎన్నికల విధులను అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు వెబ్ క్యాస్టింగ్, జీపీఎస్ స్ట్రీమింగ్‌కు సంబంధించిన టీమ్‌కు నోడల్ అధికారులుగా జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఖాసిమ్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న 10 చెక్ పోస్టుల వద్ద 24 గంటల పాటు విధుల్లో సంబంధిత బృందాలు ఉంటాయన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చడమే లక్ష్యం


జోడిమెట్లలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్‌ముదిరాజ్

ఘట్‌కేసర్: ముదిరాజ్‌లను బీసీ ఏ గ్రూపులోకి తేవడమే లక్ష్యంగా పోరాటం చేయాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌ముదిరాజ్ అన్నారు. జోడిమెట్లలో శుక్రవారం నిర్వహించిన ముదిరాజ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుగానే భావించి చిన్నచూపు చూస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ముదిరాజ్‌లకు గుర్తింపు తేవడం, బీసీ డీ గ్రూపు నుంచి బీసీ ఏ గ్రూపులోకి మార్చేందుకు కార్యచరణ చేపట్టాలన్నారు. ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారం కోసం 31న ఘట్‌కేసర్‌లో నిర్వహించనున్న ముదిరాజ్‌ల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలన్నారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కుమార్‌ముదిరాజ్, వెంకటేశ్‌ముదిరాజ్, రాజుముదిరాజ్, నాగరాజ్‌ముదిరాజ్, రాధాకృష్ణముదిరాజ్, వెంకటాపూర్, ఎదులాబాద్, ఘట్‌కేసర్ అధ్యక్షులు లింగంముదిరాజ్, బాలరత్నంముదిరాజ్, కృష్ణయ్యముదిరాజ్, అశోక్‌ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, సత్యనారాయణ ముదిరాజ్, నర్సింగ్‌రావు ముదిరాజ్, రాముముదిరాజ్ పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీ చర్యలు

జవహర్‌నగర్: ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం అన్నారు. శుక్రవారం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్నికలు నిర్వహించే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం ఆదేశాల మేరకు ఎస్ఐలు సెంట్రల్ ఫోర్స్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలు కట్టుదిట్టం చేశామని, పాత నేరస్తులను ఇప్పటికే బైండోవర్ చేశామన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు లక్ష్మణ్, అనిల్‌కుమార్‌యాదవ్, అనిల్‌కుమార్‌రెడ్డి, సెంట్రల్ ఫోర్స్ తదితరులు పాల్గొన్నారు.


జవహర్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్ఐ అనిల్‌కుమార్‌యాదవ్

సాయి గీతాశ్రమంలో మంత్రి పూజలు


సాయికుమార్ బాబా ఆశీర్వాదాలు తీసుకుంటున్న మంత్రి మల్లారెడ్డి దంపతులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సాయిగీతా ఆశ్రమంలో శుక్రవారం మంత్రి మల్లారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమంలోని సాయినాథుడిని దర్శించుకుని పూజలు చేసిన ఆయన అనంతరం స్వామిజీ సాయికుమార్ బాబా ఆశీర్వాదాలు తీసుకున్నారు. జిల్లా గ్రంథాలయాల చైర్మన్ దయాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

గిర్మాపూర్‌లో బీఆర్ఎస్ బూత్ కమిటీలు


గిర్మాపూర్‌లో బూత్ కమిటీ

మేడ్చల్: పట్టణంలోని గిర్మాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు బూత్ కమిటీలు ఏర్పాటు చేసి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్ మాట్లాడుతూ నెల రోజుల పాటు నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్లి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు


కండువాలు కప్పుతున్న సుధీర్‌రెడ్డి

మేడ్చల్: పట్టణంలోని 7వ వార్డుకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర జంగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు చాపరాజు, రాఘవేందర్‌గౌడ్ తదితరలున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

జవహర్‌నగర్: గుర్తు తెలియని మహిళ మృతిదేహం లభ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్‌నగర్‌లో వారం రోజులుగా గుర్తు తెలియని 50 ఏళ్ల మహిళ భిక్షాటన చేస్తూ ఉండేది. అనారోగ్యంతో బాధపడుతూ సులభ్ కాంప్లెక్స్ సమీపంలో చలికి వణుకుతూ ఫిట్స్‌తో మృతిచెంది ఉండవచ్చని తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఆమె వివరాలు తెలిసిన వారు - 87126 62102, 87126 62097లలో సంప్రదించాలన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

మేడ్చల్: పట్టణంలోని 18వ వార్డుకు చెందిన వివిధ పార్టీల నాయకులు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వార్డుకు చెందిన నాయకుడు రాఘవేందర్‌గౌడ్ నివాసం వద్ద నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొని పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహరెడ్డి, నాయకులు శేఖర్‌గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్: సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రిని చేయడం ఖాయమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేటలో సుమారు 30 మంది ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే దమ్ము ఏ పార్టీకి లేదని, మూడోసారి రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.



బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్

ఘట్‌కేసర్: జెడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన మంత్రి మల్లారెడ్డి, ముందుగా బీఆర్ఎస్ కండువాలు కప్పుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్ డిమాండ్ చేశారు. చౌదరిగూడలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి గ్రాఫ్ పడిపోయిందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో స్వయాన మంత్రి బావమరిదిని, ఎంపీ ఎన్నికల్లో మంత్రి అల్లుడిని కాంగ్రెస్ పార్టీ ఓడించిందని ఎద్దేవా చేశారు. టీపీసీసీ లీగల్ సెల్ మాజీ కోన్వీనర్ అమరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ చౌదరిగూడ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్, నాగేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింగ్‌రావు ముదిరాజ్ పాల్గొన్నారు.